# భారతదేశంలో కార్మికుల దుస్థితి

**ప్రజలకు** ఎన్నో హక్కులు కల్పించిన గొప్ప రాజ్యాంగం కలిగిన ప్రజాస్వామిక దేశంగా మన దేశాన్ని చెప్పుకుంటూవుంటారు. అలాగే ఈ దేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థ వుందని, చట్ట సమానత్వం పాటించబడుతుందని కూడా చెబుతారు. భారత దేశంలో ప్రజలదే అధికారమని ఊదరగొడుతూ వుంటారు. అయితే, భారతదేశంలో అత్యధికంగా వున్న కార్మికులు, కష్టజీవులు రాజ్యాంగం తమకు కల్పించిందని చెబుతున్న హక్కులనూ, స్వేచ్ఛలనూ ఏనాడూ అనుభవించలేదు. చట్టసమానత్వమనేది వారు ఎరుగనే ఎరగరు. కులీన వర్గాలు వారినెన్నడూ మానవులుగా చూసిందేలేకపోగా, వారిపై క్రూరమైన ఫ్యూడల్ దౌర్జన్యాల్ని సాగిస్తూనే వున్నారు. దోపిడీ పాలకవర్గాలు న్యాయం, సమానత్వాలను కార్మికులకు, కష్టజీవులకు దూరంచేశారు.

గత ఆరునెలల కాలంలో జరిగిన ఈ క్రింది సంఘటనలు కార్మికుల వాస్తవిక ఘోర పరిస్థితులకు అద్దంపడుతున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన ఈ సంఘటనలు సంఘటిత రంగానికో, అసంఘటిత రంగానికో చెందినవైనప్పటికీ కార్మికులను రెండవ తరగతి పౌరులుగా చూస్తున్నారని స్పష్టమౌతుంది.

**అస్సాం టీ తోట కార్మికులకు తూటాల బహుమతి**

పశ్చిమబెంగాల్‌లోని తూర్పు గోలాఘాట్ జిల్లాలో బోగిధోలా టీ తోటకు చెందిన కార్మికులు తమకు 14 శాతం బోనస్ ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. యాజమాన్యం 8.33 శాతం బోనస్ ఇవ్వటానికి అంగీకరించింది. ఈ బోనస్ దుర్గాపూజ సందర్భంగా ఇచ్చేది. ఆందోళన సాగిస్తున్న కార్మికులకు 'కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి' అనే ఓ రైతుల సమూహం మద్దతుగా నిలిచింది. కార్మికులు తమ ఆందోళనలో భాగంగా యాజమాన్యం ఇవ్వజూపిన కొద్దిపాటి బోనస్‌ను నిరాకరించారు. 13-12-2017న టీతోట యజమాని సుధీర్ రాయ్‌ను, అతని సోదరుడు సుమిత్‌రాయ్‌లను టీ తోట కార్మికులు ఘెరావో చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించబూనుకోకుండా, యజమాని మరియు అతని సోదరుడు తమ వద్దనున్న లైసెన్స్‌డ్ తుపాకీతో, పిస్టల్‌తో కార్మికులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పులలో ఐదుగురు కార్మికులకు తూటా గాయాలయ్యాయి. కాల్పులనుండి తప్పించు కునే ప్రయత్నంలో మరో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు యజమానిని, అతని సోదరుని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఇది కేవలం ఆందోళన చేస్తున్న కార్మికుల 'గుంపు' నుండి వారిని రక్షించేందుకే తప్ప, నేరానికి పాల్పడినందుకుగాను పోలీసులు వారిని అరెస్టు చేయలేదు. శాంతి భద్రతలను కాపాడటంయొక్క నిజస్వభావం ఇదే. ధనిక నేరస్తులకు రక్షణ కల్పించటం, బాధితులనే నిర్బంధించటం!

**కార్మికులకు న్యాయం-ఓ ఎండమావే!**

తమిళనాడు రాష్ట్రం-'ప్రికోల్' యాజమాన్యం కొందరు కార్మికులపై ఓ తప్పుడు క్రిమినల్ కేసు బనాయించింది. యాజమాన్య అధికారులపై హింసకు, విధ్వంసానికి పాల్పడ్డారని వారిపై నేరారోపణ చేసింది. దీనిని కల్పిత కేసుగా మద్రాసు హైకోర్టు పరిగణించింది. ఈ కేసులో పెట్టబడిన నేరాభియోగపత్రం తప్పుల తడకగా పేర్కొంది. ఆరుగురు కార్మికులను నిర్దోషులుగా పేర్కొంటూ కేసును కొట్టివేసింది.

అయితే అదేరోజున, 2017 నవంబర్ 13న, ప్రికోల్ యాజమాన్యం హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు స్వీకరించటమే గాక, ముద్దాయిలైన కార్మికులందరకూ తాఖీదులు పంపింది.

అదే సందర్భంలో, క్రింది కోర్టులో జీవితఖైదు శిక్ష విధించబడిన మనివన్నన్, రామమూర్తి అనే ఇద్దరు ప్రికోల్ కార్మికులు, తమ తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టు నాశ్రయించారు. వారు కూడా స్పెషల్‌లీవ్ పిటిషన్ దాఖలు చేయగా, సుప్రీంకోర్టు వారి కేసును కనీసం పరిశీలించటానికి కూడా ప్రయత్నించలేదు. క్రింది న్యాయస్థానం నుండి వచ్చిన పత్రాలలో నమోదైన విషయాలనే పునరుద్ఘాటించింది.

పక్షపాత రహితమైన, స్వతంత్రమైన మన న్యాయవ్యవస్థ సమన్యాయాన్ని అమలుచేసిన తీరిది! గుత్తపెట్టుబడిదారీ విధానపు నయాఉదారవాద విధానాలను ముందుకు తీసుకొనివెళ్ళే కర్తవ్యాన్ని వాస్తవంలో న్యాయస్థానాలు సైతం చేపట్టాయని స్పష్టమౌతోంది. గతంలో మారుతీ – సుజికీ, జియాజియానో కార్మికులకు కూడా ఇదే తీరులో న్యాయం నిరాకరించబడింది.

**దీర్ఘకాలంగా కొనసాగుతున్న ట్రేడ్ యూనియన్‌ను నిషేధించిన జార్ఖండ్ ప్రభుత్వం**

22000 సభ్యత్వం కలిగివుండి, 1989 నుండి కొనసాగుతున్న రిజిస్టర్డ్ కార్మిక సంఘం-మజ్దూర్ సంఘటన సమితి (ఎంఎస్ఎస్). 1985లో ఇది ఏర్పడిననాటి నుండీ, ఇది జార్ఖండ్‌లోని గిరిధి, బొకారో మరియు ధన్‌బాద్‌వంటి వివిధ ప్రాంతాలలో కార్మికులను సంఘటితపరుస్తూ వస్తోంది. బొగ్గుగని కార్మికులు, థర్మల్ విద్యుత్ కేంద్ర కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికుల నడుమ ట్రేడ్ యూనియన్ తన కార్యకలాపాలు సాగిస్తూ వస్తోంది. కార్మికుల చట్టబద్ధమైన కోర్కెలపై వారిని చైతన్యవంతం చేస్తోంది. ప్రభుత్వం చేసిన ఓ బూటకపు ఎదురుకాల్పుల ఘటనను, అందులో ఓ నక్సలైట్‌ను కాల్చిచంపటాన్ని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమానికి కూడా ఈ ట్రేడ్ యూనియన్ నాయకత్వం వహించింది. జార్ఖండ్ ప్రజల- ప్రత్యేకించి ఆదివాసుల సమిష్టి సంపద అయిన అడవిని, సహజవనరులను లూటీ చేసుకొని, కొల్లగొట్టుకెళ్ళటానికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను వ్యతిరేకిస్తూ 'మూమెంటమ్ జార్ఖండ్' పేరిట ఎంఎస్ఎస్ ఆదివాసులను సమీకరిస్తోంది.

ఎంఎస్ఎస్ కార్యకలాపాలు కార్మికుల, ప్రజల మధ్య ప్రత్యేకించి ఆదివాసుల మధ్య రాజకీయ చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి. ప్రజావ్యతిరేక ప్రభుత్వ విధానాలపై ఎంఎస్ఎస్ సాగిస్తున్న కార్యక్రమాలు ప్రభుత్వానికి సహించలేనివిగా, తలనొప్పిగా మారాయి. దీనితో వలసవాదుల కాలంనాటి 'భారత క్రిమినల్ యాక్ట్ – 1908'ని ప్రయోగించి, దానిలోని 16వ సెక్షన్‌కింద ఎంఎస్ఎస్‌ను చట్టవిరుద్ధమైన సంస్థగా ప్రకటించి నిషేధించింది. నాడు వలసపాలకుల దోపిడీకి వ్యతిరేకంగా భారతీయులు సాగించిన పోరాటాలను అణచివేయటానికి వారు రూపొందించిన చట్టాన్నే 'స్వతంత్ర' భారత పాలకులు కూడా ప్రయోగిస్తున్నారు.

కనుక, కార్మికులు తమ హక్కులను పరిరక్షించుకునేందుకు సంఘటితపడే చట్టబద్ధమైన హక్కులను కూడా దోపిడీ పాలకవర్గాల రాజ్యం ఏవిధంగా కాలరాచివేస్తుందో, న్యాయబద్ధమైన ఆకాంక్షలను కూడా ఏవిధంగా అణచివేస్తోందో మరోమారు స్పష్టమౌతోంది.

**బలవంతంగా కార్మికులచే హెచ్ఆర్ మేనేజర్ల బూట్లు తుడిపించటం**

మధ్యయుగాలనాటి నీచమైన ఫ్యూడల్ శిక్షకు కార్మికులను గురిచేసిన ఘటన ఒకటి వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం–విజయనగరం జిల్లా బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లోని హీరాఎలక్ట్రో స్మెల్టర్స్ కంపెనీలో, సూపర్‌వైజర్లు, యాజమాన్య ప్రతినిధులు అసభ్యంగా ప్రవర్తిస్తూ మహిళా కార్మికులను లైంగికంగా వేధింపులకు గురిచేస్తూ వస్తున్నారు. ఈ వేధింపులను భరించలేక, పురుష కార్మికులతో కలసి మహిళా కార్మికులు దీనిని ప్రతిఘటించారు. మహిళా కార్మికులను లైంగిక వేధింపులకు గురిచేయటంపై యాజమాన్యాన్ని నిలవేశారు.

దీనిని ఒక అవకాశంగా తీసుకొని కార్మికులు తమపై దాడికి పాల్పడ్డారంటూ యాజమాన్యం ఓ తప్పుడు కేసు బనాయించింది. ఇరువైపులా వాదనలను విన్న పోలీసులు రాజీకుదిర్చి, సక్రమంగా నడుచుకోవలసిందిగా, విధులకు హాజరవవలసిందిగా కార్మికులకు నచ్చజెప్పి పంపారు.

తప్పుడు కేసులలో ఇరికించబడి పోలీసుల వద్దకు వెళ్ళి, తిరిగివచ్చిన పురుషకార్మికులు తమ విధుల్లో చేరబోగా యాజమాన్యం వారిని పనులలోకి వెళ్ళకుండా నిలిపివేసింది. యాజమాన్య ప్రతినిధుల బూట్లను శుభ్రపరిచి, వారికి క్షమాపణ చెబితేనే విధులలో చేరటానికి అంగీకరిస్తామని షరతు విధించారు.

విషాదమేమంటే, ఈ షరతులు విధించబడిన వారు ఆ గ్రామపంచాయితి కమిటి సభ్యులుగా వున్నారు. తాము ఎన్నికకాబడిన గ్రామపంచాయితీ సభ్యులుగా గౌరవనీయ స్థితిలోవున్నాము కనుక తమకు మినహాయింపునివ్వాలని ఆ కార్మికులు కోరినప్పటికీ యాజమాన్యం వారి మొరనాల కించలేదు. యాజమాన్య ప్రతినిధుల బూట్లను శుభ్రపరచాల్సిందేనని కరాఖండిగా చెప్పింది. దీనితో, ఆ కార్మికులు యాజమాన్య ప్రతినిధుల బూట్లను శుభ్రపరుస్తుండగా, హెచ్ఆర్ సిబ్బంది తమ సెల్‌ఫోన్‌లతో దానిని వీడియోలో చిత్రీకరించి రాయపూర్‌లోని తమ కేంద్ర కార్యాలయానికి పంపారు.

2018 ఫిబ్రవరి 5న ఈ అనాగరిక చర్య జరిగింది. పని ప్రదేశాలలో మహిళా కార్మికుల భద్రత గురించి, లైంగిక వేధింపులనుండి రక్షణ కల్పించే వివిధ చట్టాల గురించి పాలకులు, వారి వందిమాగధులు సిగ్గులేకుండా చాలా గొప్పలు చెప్పుకోవటం వంచన కాదా?

అమెరికా సామ్రాజ్యవాదం తన అమానవీయ, మొరటు దోపిడీ యాజమాన్య వ్యవస్థతో అధునాతన హెచ్ఆర్ యాజమాన్య వ్యవస్థను రూపకల్పనచేసి అర్ధఫ్యూడల్ సామాజిక వ్యవస్థలలో ప్రయోగిస్తూ కార్మిక హక్కులు, వారి రక్షణ చట్టాలనేవాటి నిష్ఫలత్వాన్ని చాటిచెప్తున్నది.

పై పరిస్థితులు–న్యాయం, మానవగౌరవం వంటివి నిరాకరించబడుతూన్న భారతదేశంలోని కార్మికుల వాస్తవిక దుస్థితిని తేటతెల్లం చేస్తున్నాయి. అదేవిధంగా మరో కోణంలో తక్షణ పరిస్థితులను అందుకోలేకపోతున్న భారతదేశ కార్మికోద్యమం యొక్క దీనస్థితిని సూచిస్తున్నాయి.

oooo